సాక్షి
గుంటూరు
ఆదివారం । 5 । జనవరి । 2025



హుండీ కానుకల లెక్కింపు

కారెంపూడి: కారెంపూడిలోని చెన్నకేశవస్వామి హుండీ కానుకల ఆదాయాన్ని శనివారం లెక్కించారు. ఏడాదికిగాను రూ.1,31,046 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ కొల్లి తెలిపారు.



హంపికి అభినందనలు

తాడేపల్లిరూరల్: ప్రపంచ మహిళా చెస్ విజేత కోనేరు హంపిని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అనిమిని రవినాయుడు కొలనుకొండలో ఆమె నివాసంలో శనివారం కలిసి అభినందించారు.



కల్యాణ మహోత్సవాలు

గుంటూరు రూరల్: గోరంట్లలోని వేంకటేశ్వర స్వామి పెద్దగుడిలో నిర్వహిస్తున్న కల్యాణ మహోత్సవాలలో భాగంగా శనివారం స్వామిని పరశురామ అవతారంలో అలంకరించారు.

న్యూస్‌రీల్

కౌలు రైతులకు పంట రుణాలు

కొరిటిపాడు(గుంటూరు): జిల్లాలోని కౌలు రైతులు పంట రుణాలు తీసుకునేందుకు సమీపంలోని బ్యాంకులను సంప్రదించాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. వారికి రుణాలివ్వాలని జిల్లాలోని బ్యాంకులు, ప్రాంతీయ కార్యాలయాలకు మార్గదర్శకాలు జారీ చేశామన్నారు. ఇబ్బందులు ఎదురైతే 0863-223 2953 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. పొలం యజమానులు పంట రుణం తీసుకోకపోతే తప్పనిసరిగా కౌలు రైతులకు ఇస్తారని స్పష్టం చేశారు. గుంటూరు జిల్లాలో ఇప్పటి వరకు 5,667 మంది కౌలు రైతులకు రూ.36.80 కోట్లు పంట రుణాలు మంజూరు చేశామని వివరించారు.

ఫార్మాసిస్టు గ్రేడ్-2 మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్ : గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకుల కార్యాలయంలో ఫార్మాసిస్టు గ్రేడ్-2 పోస్టుల ఫైనల్ మెరిట్ లిస్టు విడుదల చేసినట్లు మెడికల్ అండ్ హెల్త్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ సుచిత్ర శనివారం తెలిపారు. ఫైనల్ మెరిట్ లిస్టుపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 10వ తేదీలోపు తమ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు.

ఎయిడెడ్ స్కూల్‌ను సందర్శించిన డీజీపీ



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని కృష్ణానగర్ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలను శనివారం డీజీపీ, పాఠశాల పూర్వ విద్యార్థి సీహెచ్ ద్వారకా తిరుమలరావు సందర్శించారు. 1974లో ఇదే పాఠశాలలో ప్రాథమిక విద్య పూర్తి చేసిన ఆయన్ను సహచర పూర్వ విద్యార్థులు సన్మానించారు. సహచర పూర్వ విద్యార్థులు, పాఠశాల పాలకవర్గ ఆహ్వానంపై పాఠశాలకు యూనిఫాంతో డీజీపీ వచ్చారు. విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేందుకు ఇలా వచ్చినట్లు చెప్పారు. పాఠశాలలో చదివిన సమయంలో ఉన్న అడ్మిషన్ రిజిస్టర్‌లో తన పేరు, వివరాలను ఆయన చూసుకున్నారు. కోబాల్డ్‌పేటకు చెందిన చిన్ననాటి మిత్రుడు షరీఫ్‌ను పలకరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి డాక్టర్ ఓవీ రమణ, పాఠశాల కరస్పాండెంట్ తూములూరి శ్రీరామమూర్తి, కార్యదర్శి తూములూరి సమ్మోహిత్, మాజేటి గురవయ్య, ప్రిన్సిపల్ మాధవపెద్ది విజయలక్ష్మి, హెచ్‌ఎం చిలుకూరి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల జీతాలు వెంటనే చెల్లించాలి

నరసరావుపేట రూరల్: విద్యాశాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు డిసెంబర్ నెల జీతాలు అందలేదని, వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. డిసెంబర్ జీతాలు కొన్ని ఉద్యోగ శాఖల పెన్షనర్లకు చెల్లించారని, విద్యాశాఖలోని దాదాపు రెండు లక్షల మంది ఉపాధ్యాయులకు నేటి వరకు అందలేదని తెలిపారు. బ్యాంక్ లోన్లు, ఈఎంఐల చెల్లింపులు, నూతన సంవత్సరం ఖర్చుల రీత్యా ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తక్షణమే వేతనాలు చెల్లించాలని అసోసియేషన్ నాయకులు పమ్మి వెంకటరెడ్డి, బెజ్జం సంపత్‌బాబు, కొమ్ము కిషోర్‌లు కోరారు.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన అవసరం



వేటపాలెం: ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో విద్యార్థులు ఏ విధంగా రక్షణ చర్యలు చేపట్టాలో అవగాహన కలిగి ఉండాలని నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సు (ఎన్డీఆర్‌ఎఫ్) టీం కమాండర్ ఇన్‌స్పెక్టర్ ముఖేష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం పందిళ్లపల్లి జెడ్పీహెచ్ పాఠశాలలలో ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు విపత్తులు వచ్చినప్పుడు ఎలా ఎదుర్కోవాలో ప్రదర్శన చేసే చూపించారు. అగ్ని ప్రమాదాలు, భూకంపాలు, వరదలు వచ్చిన సమయంలో ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పించారు. గుండెపోటు వచ్చిన సమయంలో ఛాతి కుదింపులతో కూడిన అత్యవసర చికిత్స విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.







డిప్యూటీ మేయర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మైకు విసిరేసి, పేపర్లు నలిపేసి సమావేశం నుంచి వెళ్లిపోతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

కమిషనర్ తమాషో!

- మైక్ విసిరేసి, పేపర్లు నలిపేసి కౌన్సిల్ సమావేశాన్ని బాయ్‌కాట్ చేసిన జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు
- సభ్యులు అడిగిన ప్రశ్నకు సరైన సమాధానం చెప్పకపోవడంపై నిలదీసిన డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు
- తమాషా అనే పదం వాడటమే తప్పుగా చూపి బయటకు వెళ్లిపోయిన కమిషనర్

గుంటూరు మున్సిపల్ కమిషనర్ కొత్త సంప్రదాయానికి తెరతీశారు. తన 'అధికార' దర్పం ప్రదర్శించారు. సభ్యుల తీరునే తప్పుబడుతూ కౌన్సిల్ సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు. అధికారులనూ హాజరు కానీయలేదు. తమాషా పడుతున్నారా.. అని డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు పేర్కొనడమే సాకుగా చూపి ఆయన ఇలా వ్యవహరించడం తీవ్ర చర్చకు దారి తీసింది. అవినీతిపై సభ్యులు ప్రశ్నించినందుకే ఇలా చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సాక్షి ప్రతినిధి, గుంటూరు : గత ఏడాది డిసెంబర్ 20వ తేదీన జరిగిన సాధారణ కౌన్సిల్ సమావేశం వాయిదా పడటంతో శనివారం కొనసాగింపు సమావేశం జరిగింది. పనులు పూర్తయిన తరువాత కాంట్రాక్టర్‌కి ఏ విధంగా బిల్లులు చెల్లిస్తారు? 2014 నుంచి నగరపాలక సంస్థ ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఎంత ఉన్నాయి? వాటిని ఏ విధంగా ఉపసంహరించుకున్నారు? వంటి వివరాలు చెప్పాలని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ షేక్ రోషన్ ప్రశ్నకు అధికారులు సరైన సమాధానం ఇవ్వలేదు. పరిపాలనాపరమైన అంశంగా తీసుకుని ఖర్చు చేశామని చెప్పారు. దీనిపై రోషన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు స్పందిస్తూ.. 11 లక్షల మంది జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజా ప్రతినిధులకు ఆర్థిక అంశాలపై జవాబుదారీగా ఉండాల్సిన అధికారులు సమాధానం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. అసలు ఈ సమాధానం ఎవరు రాశారో చెప్పాలని పలుమార్లు ప్రశ్నించారు.



సమావేశ హాలు ముందు నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్‌ను కూడా అడిగారు. తాను రాయలేదని చెప్పడంతో... ''కౌన్సిల్‌కు అధికారులు ఇచ్చే సమాధానం ఇదేనా... ఏం తమాషాగా ఉందా...? కార్పొరేటర్లు అంటే లెక్కలేదా'' అని నిలదీశారు. దీన్ని సాకుగా చూపి కమిషనర్ పులి శ్రీనివాసులు మైక్ విసిరేశారు. చేతిలోని పేపర్లు నలిపేసి బయటకు వెళ్లిపోయారు.

హాజరు కాని అధికారులు

మధ్యాహ్నం 12.30 గంటలకు ఈ వివాదం జరగడంతో మేయర్ కావటి మనోహర్‌నాయుడు సమావేశాన్ని అరగంట పాటు వాయిదా వేశారు. ఈ లోపు అధికారుల ప్రోద్బలంతో నగరపాలక సంస్థ ఉద్యోగులు, యూనియన్ నాయకులు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది అంతా కౌన్సిల్ హాల్ ముందు బైఠాయించారు. డిప్యూటీ మేయర్ క్షమాపణ చెప్పే వరకు సమావేశానికి హాజరయ్యే ప్రసక్తే లేదని చెప్పారు. తిరిగి భోజన విరామ తరువాత 2.47 గంటలకు సమావేశం ప్రారంభించారు. 3.02 గంటల వరకు అధికారులెవరు రాకపోవడంతో ఈ తీరును సభ్యులు తప్పుపట్టారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు, సభ్యుడు షేక్ రోషన్ కూడా అధికారుల తీరును నిలదీశారు. అవినీతిపై ప్రశ్నిస్తున్నందునే హాజరు కాలేదని వారు అభిప్రాయపడ్డారు. ఈ వివాదం సరికాదంటూనే తెలుగుదేశం సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. అధికారులు లేకపోవడంతో మేయర్ సమావేశాన్ని వాయిదా వేశారు. అనంతరం మేయర్ మీడియాతో మాట్లాడుతూ... ఎవరికైనా ఇబ్బంది కలిగితే తన దృష్టికి తీసుకొచ్చి ఉంటే పరిశీలించి చర్యలు తీసుకునే వారమన్నారు. సభ్యులు బదులు కమిషనర్ సభా మర్యాదలు చూడకుండా బాయ్‌కాట్ చేయడం సరికాదని చెప్పారు. ఫోను చేసినా స్పందించ లేదని తెలిపారు.

వైఎస్సార్ సీపీ అభిమాని ఆత్మహత్యాయత్నం

- టీడీపీ నాయకుల వేధింపులే కారణం
- రేపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలింపు



భట్టిప్రోలు: తెలుగుదేశం పార్టీ నాయకుల వేధింపులు తాళలేక వైఎస్సార్ సీపీ అభిమాని పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన ఇది. భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని తాతావారిపాలెం గ్రామానికి చెందిన పడమటి శేషగిరిరావు శనివారం భట్టిప్రోలు పరిధిలోని పంట పొలాల్లో పురుగుమందు తాగి అపస్మారక స్థితిలో ఉన్నాడు. పంట పొలాల్లో పనులు చేసుకుంటున్న వ్యవసాయ కూలీలు గుర్తించి అధికారులకు సమాచారం తెలియజేశారు. సమాచారం మేరకు కుటుంబ సభ్యులు, బంధువులు 108 వాహనంలో రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు రేపల్లె ప్రభుత్వాస్పత్రికి చేరుకుని బాధితుడి ఆరోగ్య పరిస్థితిని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు పడమటి శ్రీనివాసరావు, జంగం వాసు, బొల్లెద్దు ప్రతాప్, వాకా అంకబాబు, మోర్ల సత్యనారాయణ, పీజీ అరుణ్‌శాస్త్రి, పడమటి సాయి, రావు చంద్రశేఖర రావు, యస్నం సురేష్ ఉన్నారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 1516 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 74, తూర్పు కెనాల్‌కు 204, పశ్చిమ కెనాల్‌కు 100, నిజాంపట్నం కాలువకు 53, కొమ్మమూరు కాలువకు 1005 క్యూసెక్కులు విడుదల చేశారు.

బాల మేధస్సు.. సమాజ శ్రేయస్సు

జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో వినూత్న ప్రాజెక్టులకు రూపం

గుంటూరు ఎడ్యుకేషన్ : తరగతి గదుల్లో పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులు మెదడుకు పదును పెట్టారు. సమాజం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై తమ మేధస్సుతో పరిష్కారం చూపారు. పాత బస్టాండ్ సెంటర్లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల దీనికి వేదికైంది. జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులు గైడ్ ఉపాధ్యాయుల సహకారంతో రూపొందించిన నమూనా ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు, ఉపాధ్యాయులతో డీఈవో రేణుక తదితరులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు డీఈవో సీవీ రేణుక ప్రశంసాపత్రాలు, జ్ఞాపిక బహూకరించారు. విజేతలు వీరే...

- గ్రూపు విభాగంలో కె.గౌరీనాథ్, షేక్ లతీఫ్ (జెడ్పీ హైస్కూల్, రావెల), ఎండీ అనీసాబేగం, ఇ. ఈర్షిత (శారదానికేతన్ హైస్కూల్, గుంటూరు), అక్షయ, లిఖిత (జెడ్పీ హైస్కూల్, మేడికొండూరు)
- వ్యక్తిగత విభాగంలో షేక్ నజ్మా (జెడ్పీ హైస్కూల్, నారాకోడూరు), ఎస్. పవన్‌దుర్గ (జెడ్పీ హైస్కూల్, ముట్లూరు), షేక్ సనా ఫిర్దోస్ (సీకే జూనియర్ కాలేజ్ హైస్కూల్, మంగళగిరి)
- ఉపాధ్యాయ విభాగంలో జి. శ్రీనివాసరావు (జెడ్పీ హైస్కూల్, జీజీ పాలెం), ఎస్. భాస్కర రావు (జెడ్పీ హైస్కూల్, సిరిపురం), కె. రామారావు (జెడ్పీ హైస్కూల్, వట్టిచెరుకూరు)
- క్విజ్ పోటీల్లో పులిపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గుంటూరు, జెడ్పీ హైస్కూల్స్ అత్తోట, నారాకోడూరు
- బుక్ ఫెయిర్‌లో కె. వెన్నెల – ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, గుంటూరు; ఎస్. సౌమ్యచంద్ర, జెడ్పీ హైస్కూల్, వింజనంపాడు; షేక్ రుక్సానా, జెడ్పీ హైస్కూల్, కొప్పర్రు.

గగన్‌యాన్..



బ్రాడీపేటలోని శారదానికేతన్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎండీ అనీసాబేగం, ఇ.ఈర్షితలు గైడ్ టీచర్ ఆరిఫ్ బేగ్ సహకారంతో దీనికి రూపకల్పన చేశారు. మానవులను అంతరిక్షంలోకి పంపేందుకు ఇస్రో చేపట్టిన ప్రాజెక్టు గగన్‌యాన్ విశేషాలను వివరించారు. అంతరిక్షంలోకి మనుషులను తీసుకువెళ్లి, సురక్షితంగా తీసుకువచ్చేందుకు శాస్త్రవేత్తలు చేస్తున్న పరిశోధనల గురించి నమూనా ప్రాజెక్టులోకి పొందుపర్చారు.

మహిళలకు రక్షణగా...



మంగళగిరిలోని కేకే మున్సిపల్ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థినులు షేక్ జిక్రా, సీహెచ్ శ్రావణిలు గైడ్ టీచర్ దరియావలి పర్యవేక్షణలో రూపొందించిన ప్రాజెక్టు ద్వారా మహిళలు, విద్యార్థినులు ఆత్మరక్షణ కోసం తమ వద్ద ఉంచుకోవాల్సిన పలు ఉపకరణాలను గురించి వివరించారు. దుండగుల బారి నుంచి కాపాడుకునేందుకు విద్యుత్ షాక్‌ను కలిగించే స్టన్‌గన్, పెప్పర్ స్ప్రే, లేజర్ లైట్ సెక్యూరిటీ అలారం, రిస్ట్ బ్యాండ్, నైఫ్ నమూనాలను ప్రదర్శించారు.

కాలుష్య నియంత్రణకు...



పెదకాకాని జెడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థులు జె. జగన్, ఎ.కరుణాకర్‌లు గైడ్ ఉపాధ్యాయురాలు ఎస్.పద్మావతి ఆధ్వర్యంలో కాలుష్య నివారణకు నమూనా ప్రాజెక్టు తయారు చేశారు. పరిశ్రమల నుంచి వెలువడుతున్న గాలి, నీరు వల్ల కాలుష్యం ఏర్పడకుండా ఫిల్టర్లను అమర్చాలని తమ ప్రయోగం ద్వారా వివరించారు. హానికారక రసాయనాలు, వ్యర్థాలను తగులబెట్టకుండా భూమిలో పాతిపెట్టడం ద్వారా పర్యావరణానికి మేలు అని చెప్పారు.

స్టాంప్ పేపర్‌కూ 'ఆధారే'!

- అడ్డగోలు నిబంధనలతో వెండార్లకు తిప్పలు
- ఆధార్ నంబర్ ఇచ్చి, ఓటీపీ చెబితేనే లభ్యం
- కంప్యూటర్, ప్రింటర్ వంటి సామగ్రి తప్పనిసరి
- అసలే అరకొరగా సాగుతున్న అమ్మకాలు



నాన్ జుడీషియల్ స్టాంపు పేపర్లు

గుంటూరు వెస్ట్ : జిల్లాలోని స్టాంపు వెండార్ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన నూతన విధానం వీరితోపాటు ప్రజలకు కూడా కష్టాలు తెచ్చిపెడుతోంది. గతంలో స్టాంపు కావాలంటే నేరుగా వెండార్ వద్దకు వెళ్లిగానీ, ఎవరినైనా పంపించిగానీ కొనుగోలు చేసుకోవచ్చు. ఇప్పుడు స్టాంపు కావాల్సిన వారే వెళ్లాలి. ఆధార్ కార్డు నెంబరు ఇచ్చి వారి ఫోన్ నెంబర్‌కు వచ్చే ఓటీపీ చెప్పాలి. అప్పుడు కంప్యూటర్‌లో నమోదు చేసి స్టాంపు ప్రింట్ తీసి ఇస్తారు. స్టాంపు కోసం కనీసం 15 నిమిషాలకుపైనే పడుతోంది. ఆన్‌లైన్‌లో ఆధార్ ఓపెన్ కాకపోతే స్టాంపు లభించదు.

కంప్యూటర్ తదితరాలు అవసరం

ప్రతి స్టాంపు వెండార్ ఒక దుకాణంతోపాటు కంప్యూటర్, ప్రింటర్, డిస్‌ప్లే ఏర్పాటు చేసుకోవాలి. ఈ వృత్తిలో చాలా మంది పెద్దవారు ఉన్నారు. అరకొర ఆదాయంతో ఇంత సెటప్ ఏర్పాటు చేసుకోవడం సాధ్యం కాదు. చాలామందికి కంప్యూటర్ పరిజ్ఞానం లేదు. పైగా స్టాంపుల విక్రయం అరకొరగానే ఉంటోంది. రోజు సంపాదించే రూ.మూడు నాలుగొందలతోనే జీవిస్తున్నారు. వారందరూ వృత్తికి దూరం కావాల్సిన పరిస్థితి నెలకొంది. గడిచిన నెల రోజుల నుంచి కనీసం తీసుకున్న స్టాకులో 5 శాతం కూడా స్టాంపు వెండార్లు విక్రయించలేదు.

ఐజీ కార్యాలయం ఏకపక్ష నిర్ణయం

కొత్త విధానం అమలులో రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖాధికారుల పాత్రే కీలకం. కనీసం జిల్లా రిజిస్ట్రార్లకు, సబ్ రిజిస్ట్రార్లకు, స్టాంపు వెండార్లకు ముందు చెప్పకుండానే అమలు చేస్తున్నారు. వెండార్ స్టాంపులు విక్రయించాలంటే ముందుగా కంప్యూటర్‌లో లాగిన్ అవ్వాలి. దీనికి ఒక ఓటీపీ వస్తుంది. దానిని నమోదు చేయాలి. 15 నిమిషాలు కంప్యూటర్ వాడకపోతే మళ్లీ వ్యవహారం మొదటికే వస్తుంది. పాత తేదీల్లో స్టాంపులు విక్రయించకుండా ఈ విధానం తెచ్చామని ఉన్నతాధికారులు అంటున్నారు. ఆ తరహా కొనుగోలు దాదాపుగా ఆగిపోయింది. పాత తేదీల్లో అగ్రిమెంట్లు రాసుకున్నా అవి పనికిరావు. ప్రస్తుత మార్కెట్ వాల్యూ ప్రకారమే ఫీజులు చెల్లించాలి. తమను సాగనంపేందుకే ఇలా చేస్తున్నారని వెండార్లు వాపోతున్నారు. ఇప్పటికే అధికారులకు తమ సమస్యలను వివరించామని పేర్కొన్నారు.

చాలా ఇబ్బందులు



కొత్త విధానంలో నిబంధనల అమలు సాధ్యం కావడం లేదు. ఆధార్ కార్డు నెంబర్, ఓటీపీ చెప్పమంటే ప్రజలు తిరస్కరిస్తున్నారు. రోజుకు రూ.500 కూడా ఆదాయం రాని వెండార్లు... ప్రత్యేకంగా షాపు, కంప్యూటర్, ప్రింటర్ వంటివి ఏర్పాటు చేసుకోవడం ఇబ్బందికరమే. చాలా మంది స్టాంపుల విక్రయాలు ఆపేస్తున్నారు. ఇప్పటికే అధికారులకు వినతిపత్రాలు అందించాం.

– షేక్ రషీద్, స్టాంపు వెండార్ల సంఘం జిల్లా జేఏసీ చైర్మన్

క్రైస్తవులు హృదయ శుద్ధి కలిగిఉండాలి

గుంటూరు పూర్వ పీఠాధిపతులు, కడప అపోస్తలిక పాలనాధికారి డాక్టర్ గాలి బాలి

పెదకూరపాడు: క్రైస్తవులు హృదయ శుద్ధి కలిగి, క్రీస్తు మార్గంలో నడవాలని గుంటూరు పూర్వ పీఠాధిపతులు, కడప అపోస్తలిక పాలనాధికారి మహా ఘన, రైట్ రెవరెండ్ డాక్టర్ గాలి బాలి తెలిపారు. ముగ్గురు రాజుల దేవాలయ శత వార్షికోత్సవంలో భాగంగా శనివారం డాక్టర్ గాలి బాలి గురుత్వ వజ్రోత్సవం, పీఠాధిపత్య రూబీ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక దివ్యపూజ బలిని డాక్టర్ గాలి బాలి నిర్వహించారు. 20 సంవత్సరాలు గురువుగా, 40 సంవత్సరాలు ఉమ్మడి గుంటూరు జిల్లా పీఠాధిపతులుగా దైవసేవలు అందించిన ఆయనకు పాటిబండ్ల ముగ్గురు రాజుల దేవాలయ సంఘ పెద్దలు, సంఘస్తులు, గ్రామ ప్రజలు, కన్య స్త్రీలు, విచారణ గురువులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ గాలి బాలి మాట్లాడుతూ చెడు వ్యసనాలు , చెడ్డ ఆలోచనలు లేకుండా దైవ చింతనతో ఆధ్యాత్మిక జీవనం సాగించాలని తెలిపారు. పుట్టిన గ్రామానికి సేవలు అందించాలనే సంకల్పంతో అనేక దైవ సేవలు, పేద విద్యార్థుల అభ్యున్నతికి కృషితో పాటు సామాజిక సేవలను అందించామని గుర్తు చేసుకున్నారు. గురుత్వం దేవుడు ఇచ్చిన వరమని, అనుక్షణం అందులో జీవించడం మహా సంతృప్తిని ఇచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ గాలి బాలి జీవిత విశేషాలను ఆడియో వీడియో రూపంలో ప్రదర్శించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దివ్యబలి పూజ అనంతరం వందకు పైగా గురువులు, మఠకన్యలు, సంఘ పెద్దలు, కడప, అనంతపురం, పల్నాడు, గుంటూరు, హైదరాబాద్, విదేశాల నుంచి వచ్చిన భక్తులు డాక్టర్ గాలి బాలిని సత్కరించారు. గురుత్వ వజ్రోత్సవం, పీఠాధిపత్య రూబీ జూబ్లీ వేడుకల వేళ, ముగ్గురు రాజుల ఆలయ శత వార్షికోత్సవం సందర్భంగా డాక్టర్ గాలి బాలి తన తల్లిదండ్రులు గాలి చిన్నప్పరెడ్డి శౌరమ్మ జ్ఞాపకార్థం నిర్మించిన నూతన కల్యాణ మండపం, భోజనశాల భవనాన్ని ప్రారంభించి గ్రామానికి అంకితం చేశారు.



డాక్టర్ గాలి బాలిని సత్కరిస్తున్న గురువులు

పెనుగొండ సాహిత్య సేవలు ఆదర్శం

విజయవాడకల్చరల్: పెనుగొండ లక్ష్మీనారాయణ సాహిత్యసేవలను ఆదర్శంగా తీసుకోవాలని అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ అన్నారు. అభో.విభో, కందాళం, జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో బందరురోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న నాటకోత్సవాలు సామాజిక అంశాలను చాటుతున్నాయి. శనివారం నాటి కార్యక్రమంలో కథానాటిక ప్రదర్శనలు, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణకు విశిష్ట సాహితీమూర్తి జీవితకాల సాధన పురస్కారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెనుగొండ ఆధ్వర్యంలో అభ్యుదయ రచయితల సంఘం ఉత్సాహంతో పరుగులు పెడుతోందన్నారు. నిర్వాహకులు పెనుగొండకు విశిష్ట సాహితీమూర్తి విశిష్ట సేవా పురస్కారంతో పాటు రూ.50 వేల నగదు పురస్కారం ప్రదానం చేశారు. విడాకులు కావాలి, దేవ రాగం నాటికలు ప్రదర్శించారు.



పెనుగొండ లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న నిర్వాహకులు

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,400 గరిష్ఠం : రూ. 3,200

మోడల్ ధర రూ. 2,800

క్లుప్తంగా

ఏకాదశి పూజలకు ఏర్పాట్లు



తాడేపల్లిరూరల్ : వైకుంఠ ఏకాదశి సందర్భంగా హరేకృష్ణ గోకుల క్షేత్రంలో రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు వంశీధర దాస తెలిపారు. శనివారం ఆత్మకూరులోని అక్షయపాత్ర కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కొలనుకొండలోని హరేకృష్ణ గోకుల క్షేత్రంలో ఈ నెల 10, 11వ తేదీలలో ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. ప్రత్యేక అలంకరణలోని స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం, లక్షార్చన, సాయంత్రం స్వామివారి కళ్యాణం నిర్వహించనున్నామని చెప్పారు. ప్రత్యేక అలంకరణలో శ్రీ రంగనాథుని దర్శనం ఉంటుందని తెలిపారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్ ఆవిష్కరించారు. క్షేత్రం ప్రతినిధులు విలాసదాస, రఘునందన్ దాస, వైకుంఠ నారాయణ దాస తదితరులు పాల్గొన్నారు.

టైప్ రైటింగ్‌లో మంగళగిరి విద్యార్థిని ప్రతిభ



తాడేపల్లి రూరల్ : ఆంధ్రప్రదేశ్ స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నిర్వహించిన టైప్‌రైటింగ్ పరీక్షలలో మంగళగిరికి చెందిన విద్యార్థిని రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించింది. శనివారం మాధవి టైప్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు మాట్లాడుతూ.. గతేడాది నిర్వహించిన టైప్ రైటింగ్ ఎగ్జామినేషన్‌లో తెలుగు టైపు రైటింగ్ లోయర్ గ్రేడ్ పరీక్షలలో తమ ఇనిస్టిట్యూట్ నుంచి హాజరైన ఆరాధ్యుల పూజిత సాయికి 192/200 మార్కులు వచ్చాయన్నారు. స్టేట్ మొదటి ర్యాంక్ సాధించిందని, ఆమెను అభినందిస్తున్నామని తెలిపారు.

ధనుర్మాస ఉత్సవాల్లో పురందేశ్వరి



తాడేపల్లి రూరల్ : త్రిదండి చిన్న జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ధనుర్మాస వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం మంగళగిరి బాపూజీ విద్యాలయంలో 20వ రోజు 20వ పాశురాన్ని భక్తులకు వివరించారు. అనంతరం గోదా అమ్మవారికి అష్టోత్తరం, తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి పాల్గొని, స్వామి వారి మంగళ శాసనాలు అందుకున్నారు. సుమారు 300 మంది భక్తులు గోదా అమ్మవారికి సారె సమర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సీతానగరం జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు పాల్గొన్నారు.

కళాశాలల్లో ఉత్తీర్ణత పెంపునకు కృషి

జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి



విద్యార్థినులకు ఆహారం వడ్డిస్తున్న జిల్లా కలెక్టర్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణతా శాతాన్ని పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథక కార్యక్రమాన్ని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్‌తో కలసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని ఐదు కళాశాలల్లో పథకం అమలు కానుందన్నారు. మూడు చోట్ల అక్షయ పాత్ర, రెండు చోట్ల బడిలో మధ్యాహ్న భోజనం వండే ఏజెన్సీలతో ఏర్పాట్లు చేశామని వివరించారు. విద్యార్థులకు గుణాత్మక విద్య అభివృద్ధికి కళాశాలల్లో పని గంటలను పెంచామన్నారు. సంకల్ప్ ద్వారా ఉత్తీర్ణతా శాతం మెరుగు, స్టార్ రేటింగ్ ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు స్టడీ అవర్స్ పెడుతున్నట్లు చెప్పారు. ఐఐటీ మద్రాస్ ప్రవర్తక్ టెక్నాలజీ ఫౌండేషన్ సౌజన్యంతో మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లిషు సబ్జెక్టులు బోధిస్తారన్నారు. కరికులమ్ రివిజన్ వచ్చే విద్యా సంవత్సరంలో అమలు చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్‌తో మాట్లాడి కళాశాలల్లో టాయ్‌లెట్స్ నిర్మాణానికి రూ.24 లక్షలు మంజూరు చేయించామని తెలిపారు. వృత్తి విద్యా కోర్సులు కూడా అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో డీఈవో సీవీ రేణుక, డీవీఈవో జె.పద్మ, ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపల్ వీఆర్ జ్యోత్స్నకుమారి, బాలికల, వృత్తి విద్యా జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ జి. సునీత, కె.ఆనందబాబు, తహసీల్దార్ నగేష్, కార్పొరేటర్ పోతురాజు సమత, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సర్వేలను నూరు శాతం పూర్తి చేయాలి



మాట్లాడుతున్న డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ

తాడికొండ: ప్రభుత్వం సూచించిన 6 రకాల సర్వేలను వేగవంతంగా నూరు శాతం పూర్తిచేయాలని జెడ్పీ డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ అన్నారు. తాడికొండ, తుళ్ళూరు మండల పరిషత్ కార్యాలయాల్లో కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో కొనసాగుతున్న మిక్సింగ్ ఆధార్, హౌస్ హోల్డ్ సర్వే, ఎంఎస్ఎంఈ సర్వే, గ్రామ పంచాయతీ పరిధిలోని కమ్యూనిటీ స్థలాల ఆన్‌లైన్ సర్వే, సీఏసీఎస్‌లో రుణాలు తీసుకున్న వారి నిర్ధారణ సర్వే నూరుశాతం పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణ పథకం కింద పనులు ప్రారంభించి నిలిపివేసిన వాటిని వెంటనే పూర్తి చేయించేలా చూడాలన్నారు. తాడికొండ, తుళ్ళూరు మండలాల ఎంపీడీవోలు కె సమతావాణి, కానూరి శిల్ప, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టాభిషేక మహోత్సవాలు ప్రారంభం

నగరంపాలెం: స్థానిక మారుతీనగర్ శ్రీకంచి కామకోటి పీఠ శ్రీమారుతీ దేవాలయ ప్రాంగణంలో శ్రీరామ మహా సామ్రాజ్య పట్టాభిషేకం మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభించారు. తొమ్మిది రోజుల పాటు జరగనున్న మహోత్సవాలను శ్రీ శృంగేరి శ్రీవిరూపాక్ష శ్రీపీఠాధిపతులు శ్రీగంభీర్ ఆనంద భారతి స్వామి ప్రారంభించారు. అనంతరం శ్రీమద్రామాయణ పారాయణం మొదలైంది. 24 వేల శ్లోకాలకు హోమం, అగ్ని ప్రతిష్టాపన కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరామ సేవాసమితి నిర్వాహకులు సోమయాజులు, పాలక మండలి సభ్యులు కొరపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం సహస్ర నామార్చన హారతి, నిరాజల మంత్ర పుష్పాలు, దర్బారు సేవ జరిగాయి. కార్యదర్శి రఘురామ్, తంగిరాల శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'యువగళం' హామీలకు మంగళం

- జీవో నెంబర్ 77ను వెంటనే రద్దు చేయాలి
- తల్లికి వందనం అమలుకు ఏఐఎస్ఎఫ్ డిమాండ్



డిమాండ్ల కరపత్రంతో పాశం వెంకటేష్, ఇతర నేతలు

తెనాలి: మంత్రి నారా లోకేష్ గతంలో నిర్వహించిన యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలపై అధికారంలోకి వచ్చాక మాట తప్పారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు పాశం వెంకటేష్ మండిపడ్డారు. గాంధీనగర్‌లోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే జీవో నెంబర్ 77ను రద్దు చేస్తానని లోకేస్ హామీ ఇచ్చినట్టు వెంకటేష్ గుర్తుచేశారు. తల్లికి వందనం పథకం కింద విద్యార్థులందరికీ రూ.15 వేల చొప్పున ఇస్తామని వాగ్దానం చేశారని అన్నారు. అధికారంలోకి వచ్చి ఆర్నెల్లు అవుతున్నా, ఆ ఊసే లేకుండా పోయిందన్నారు. రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో వచ్చే విద్యా సంవత్సరానికి తల్లికి వందనం పథకం అమలు చేయాలన్న తీసుకున్న నిర్ణయాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. మాయ మాటలు చెప్పి లక్షల మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను నమ్మించి నట్టేట ముంచారని మండిపడ్డారు. ఈ సంవత్సరం నుంచే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. లేని పక్షాన రాష్ట్రవ్యాప్తంగా కలిసి వచ్చే విద్యార్థి సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ నిధులు రూ.4,500 కోట్లను వెంటనే విడుదల చేయాలని, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గండు శివ మాట్లాడుతూ సోమవారం ఉదయం 10 గంటలకు జరిగే ర్యాలీలో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. తెనాలి నియోజకవర్గ అధ్యక్షుడు చెన్నూర్‌రు సాయి, ఉపాధ్యక్షుడు భూమేష్, తేజ, దుర్గాప్రసాద్, యశ్వంత్, పవన్, సాల్మన్, కోట్లు యాదవ్, మద్దినేని కిరణ్ బాబు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఇద్దరు మృతి

తిప్పర్తి: బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల కేంద్రం సమీపంలో జరిగింది. తిప్పర్తి ఎస్ఐ సాయి ప్రశాంత్ కథనం ప్రకారం.. దామరచర్ల మండలం దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన గంధం శ్రీనివాస్(35) శనివారం బైక్‌పై తిప్పర్తికి వెళ్తున్నాడు. నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయం వద్ద వెనుక నుంచి కారు వేగంగా వచ్చి ఢీకొంది. బైక్ పక్కనే ఉన్న పొలంలోకి దూసుకెళ్లగా శ్రీనివాస్ మృతి చెందాడు. కారు అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టడంతో అందులో ఉన్న గుంటూరుకు చెందిన కొండసారి శిరీష (39) కూడా ఎగిరి పక్కనే ఉన్న పొలంలో పడి మృతి చెందింది. కారు డ్రైవర్ టంగుటూరి సందీప్, మరో మహిళ రూపూడి రాణికి తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరు మహిళలు క్యాటరింగ్ చేస్తుంటారని, శిరీష అనారోగ్యం పాలవడంతో హైదరాబాద్ ఆస్పత్రిలో చూపించుకుని తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగినట్లు ఎస్ఐ తెలిపారు. శిరీషకు ఇద్దరు పిల్లలు ఉన్నట్లు పేర్కొన్నారు.

ఉద్యోగం పేరిట రూ.8 లక్షల మేరకు మోసం

- ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఆర్మీ ఉద్యోగి దగా
- మనస్తాపంతో బాధిత మహిళ ఆత్మహత్యాయత్నం



నిందితుడు ఆళ్ల రామకృష్ణ

మధురానగర్ (విజయవాడ సెంట్రల్): ఇన్‌స్టాగామ్‌లో ఏర్పడిన పరిచయంతో ఆర్మీ ఉద్యోగి చేతిలో నగరానికి చెందిన మహిళ బండి ఆశ (35) మోసపోయారు. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన బండి ఆశ పిల్లల చదువుల కోసం నగరానికి వచ్చారు. ఆర్మీలో పనిచేసే ఆళ్ల రామకృష్ణ ఇన్‌స్టాగామ్‌లో ఆమెకు పరిచయం అయ్యాడు. ఆర్మీలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ పశ్చిమ బెంగాల్‌కు రావాలని నమ్మబలికాడు. ఆమె వెళ్లాక రూ.8 లక్షలు తీసుకున్నాడు. 11 రోజుల పాటు అతనితో కలిసి ఆమె పశ్చిమ బెంగాల్‌లో ఉన్నారు. ఉద్యోగం కోసం ఎన్నిసార్లు అడిగినా మాట దాటవేశాడు. ప్రస్తుతం ఆర్మీలో పరిస్థితులు బాలేదంటూ రామకృష్ణ తన భార్య పేరుతో విజయవాడకు రైలు టికెట్ తీసి ఆశను బలవంతంగా పంపించేశాడు. తరువాత ఎన్నిసార్లు అడిగినా రామకృష్ణ స్పందించలేదు. దీంతో రామకృష్ణ స్వగ్రామం గుంటూరు జిల్లా పొన్నూరు వెళ్లి నగదు కోసం ఆమె అడిగారు. అసభ్యంగా మాట్లాడుతూ దాడి చేసేందుకు యత్నించడంతో భయపడి విజయవాడకు వచ్చేశారు. అనంతరం నవంబర్ 25న స్పందనలో ఫిర్యాదు చేశారు. డిసెంబర్ 5వ తేదీన ఈ కేసును దర్యాప్తు నిమిత్తం గుణదల పోలీస్‌స్టేషన్‌కు పంపించారు. గుణదల పోలీసులు కేసు నమోదు చేసి రామకృష్ణను పిలిపించి కౌన్సెలింగ్‌కు సైతం పంపించారు. అయినప్పటికీ డబ్బులు ఇవ్వకపోగా నోటికి వచ్చినట్లు మాట్లాడాడు. ఆమె మనస్తాపానికి గురయ్యారు. ఇంట్లో సైతం గొడవలు జరగడంతో మురళీనగర్‌లోని నివాసంలో శనివారం ఆమె ఆత్మహత్యాయత్నం చేశారు. స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తనకు జరిగిన అన్యాయం ఎవరికీ జరగకూడదని ఆమె పేర్కొన్నారు. తన నగదు తిరిగి ఇవ్వాలని కోరారు. ఆశ ఆస్పత్రి పాలవ్వడంతో ఆమె ఇద్దరు కుమార్తెలు, కుమారుడు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

జిల్లా కోర్టు ఆవరణలో ధూమపానం చేస్తే జరిమానా



బోర్డు ఏర్పాటును పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి, కార్యదర్శి లీలావతి

నగరంపాలెం: ఇక నుంచి జిల్లా కోర్టు ఆవరణలో ఎవరైనా ధూమపానం చేస్తే రూ.200 జరిమానా విధించనున్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి శనివారం జిల్లా కోర్టు ఆవరణలో ఆకస్మికంగా పర్యటించారు. కోర్టుల భవన సముదాయాల వద్ద పరిసరాలను పరిశీలించారు. అల్పాహారం, టీ దుకాణదారులతో మాట్లాడారు. ఎవరైనా సిగరెట్లు విక్రయిస్తే దుకాణాలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ధూమపానం చేస్తే రూ.200 జరిమానా విధించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు అంగ్లం, తెలుగులో ముద్రించిన ప్రచార బోర్డులను రద్దీగా ఉండే ప్రదేశాల్లో ఏర్పాటు చేయించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టవిరుద్ధం

- నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాల్సిందే
- తెనాలి డివిజనల్ సమీక్షా సమావేశంలో సబ్ కలెక్టర్



మాట్లాడుతున్న వి.సంజనా సింహ

తెనాలి: గర్భధారణ తర్వాత లింగనిర్ధారణ పరీక్షలు చేయటం చట్టవిరుద్ధమని, దీనికి సంబంధించిన చట్టంపై ప్రచారం కల్పించాలని తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ ఆదేశించారు. లింగ నిర్ధారణ చట్టంపై తెనాలి డివిజనల్ సమీక్షా సమావేశాన్ని శనివారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. అధ్యక్షత వహించిన సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ పీసీ–పీఎన్‌డీటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. చట్టానికి సంబంధించిన బోర్డులను, ఆడ శిశువుల అవసరాన్ని తెలియజెప్పే బోర్డులనూ కనిపించేలా ఉంచాలని చెప్పారు. మందుల షాపుల్లో అబార్షన్ మాత్రలను విక్రయించకుండా ఔషధ నియంత్రణ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివాహ వయసుపై కౌన్సెలింగ్ నిర్వహించటం, పాఠశాల స్థాయి నుంచే నైతిక విలువలను నేర్పించేలా కృషి చేయాలన్నారు. మెంబర్ సెక్రటరీ, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ మాట్లాడుతూ.. తెనాలి డివిజనులో మొత్తం 66 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని చెప్పారు. అన్ని సెంటర్లపైనా నిఘా ఉందన్నారు. తరచూ తనిఖీలు చేస్తూ, రెన్యూవల్ చేయాల్సిన వాటిని గుర్తిస్తున్నామని తెలిపారు. పరీక్షలకు వసూలు చేసే రేట్ల వివరాలతో కూడిన బోర్డులను అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలని చెప్పారు. సమావేశంలో డీ3 శారద సర్వీసెస్ సొసైటీ ప్రతినిధి ఎస్.శ్రీనివాసరావు, డాక్టర్ ఏవీ ప్రసాద్, ఆర్.ఎస్.రాజేశ్వరి, బి.రాజ్యలక్ష్మి, బి.లక్ష్మీరేఖ, జీఏఆర్‌యూ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

నదిలో దూకిన యువకుడు

- కాపాడటానికి వెళ్లిన పోలీసులు
- ముప్పుతిప్పలు పెట్టి పరారీ



ఒడ్డుకు రావాలని ప్రకాశం బ్యారేజ్‌పై నుంచి సూచిస్తున్న పోలీసులు

తాడేపల్లి రూరల్: ప్రకాశం బ్యారేజ్ రైలింగ్ నుంచి కృష్ణా నదిలోకి ఓ యువకుడు శనివారం దూకాడు. ఆత్మహత్య చేసుకున్నాడని భావించి కాపాడేందుకు వచ్చిన పోలీసులను ముప్పుతిప్పలు పెట్టి పారిపోయాడు. వివరాలు.. కృష్ణానది ప్రకాశం బ్యారేజ్ 14వ ఖానా వద్ద దిగువ ప్రాంతంలో యువకుడు నీటిలోకి దూకాడు. అది గమనించిన ప్రజలు తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. యువకుడు పైకి తేలకుండా నీటిలోనే ప్రకాశం బ్యారేజ్ కిందకు వెళ్లడంతో పైనున్న వారికి అతడు కనిపించలేదు. ఆత్మహత్య చేసుకున్నాడని భావించారు. పోలీసులు వచ్చి పరిశీలించగా సదరు యువకుడు నీటిలో తేలియాడుతూ కనిపించాడు. సుమారు 50 అడుగుల ఎత్తు నుంచి దూకడంతో నీటి అడుగున ఉన్న కాంక్రీట్ ఫ్లోరింగ్ తగిలి మృతి చెంది ఉంటాడని భావించారు. 20 నిమిషాల అనంతరం ఆ యువకుడు ఈత కొట్టడంతో పోలీసులు పైకి రావాలని సూచించారు. పోలీసులను చూసి కంగారు పడిన అతడు దిగువ యాప్రాన్ నుంచి కృష్ణానది గేట్లు ఎక్కాడు. మళ్లీ ఎగువ ప్రాంతంలో ఈదుకుంటూ కిందికి దిగి ప్రకాశం బ్యారేజ్ గేట్లకు కిందభాగంలో ఉన్న సొరంగ మార్గం ద్వారా విజయవాడ వైపు వెళ్లిపోయాడు.



తేలియాడుతున్న యువకుడు

నాలుగేళ్లుగా భోజనం చేయడానికీ అవస్థలే

ఆపరేషన్‌తో మహిళకు ఉపశమనం కల్పించిన జీజీహెచ్ వైద్యులు



వైద్యులు, రోగితో సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ

గుంటూరు మెడికల్: నాలుగు సంవత్సరాలుగా అన్నం మింగుడుపడక, మంచినీరు తాగేందుకు కూడా అవస్థలు పడుతూ తీవ్ర అనారోగ్యానికి గురైన మహిళకు గుంటూరు జీజీహెచ్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు అరుదైన ఆపరేషన్ చేసి వ్యాధి నుంచి విముక్తి కల్పించారు. శనివారం గుంటూరు జీజీహెచ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలను సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అండెకోటి వెంకటేశ్వరరావు మీడియాకు వెల్లడించారు. మచిలీపట్నానికి చెందిన వెంకట మహాలక్ష్మి నాలుగేళ్లుగా ఈ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా వ్యాధి నయం కాలేదు. గత ఏడాది డిసెంబరులో జీజీహెచ్‌కు రాగా, వైద్య పరిభాషలో ఎక్సాషియా కార్డియా సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించారు. డిసెంబరు 24న సుమారు 3 గంటల సేపు విజయవంతంగా ఆపరేషన్ చేశామన్నారు. ఎనస్థీషియా వైద్య విభాగాధిపతి డాక్టర్ పోలయ్య సహకరించారన్నారు. రోగిని డిశ్చార్జి చేసినట్లు వెల్లడించారు. సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ ఎండోస్కోపిక్ ద్వారా కోత, కుట్లు లేకుండా అత్యాధునిక వైద్య పరికరాలతో ఆపరేషన్ చేశారన్నారు. వైద్యులను అభినందించారు.